రూ. 50 కోట్ల ఆస్తిపన్ను వసూలు

నేడు, రేపు అందుబాటులో కౌంటర్లు

- మరో రూ. 4 కోట్లు వసూలైతే వంద శాతం పూర్తి
- బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- రాజేంద్రనగర్ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను వసూలులో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ వంద శాతానికి చేరువలో చేరుకుంది. శనివారం సాయంత్రానికి రూ. 50 కోట్ల మేర ఆస్తిపన్నును వసూలు చేసింది. 2024–25వ సంవత్సరానికి గాను జీహెచ్ఎంసీ రూ. 54 కోట్లను టార్గెట్‌గా విధించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లు కొనసాగుతున్నాయి. ఆయా డివిజన్ల పరిధిలో శనివారం సాయంత్రానికి సిబ్బంది రూ. 50 కోట్ల మేర వసూలు చేశారు. మరో రూ. 4 కోట్లు వసూలు చేస్తే వంద శాతం పన్ను వసూలు చేసి రికార్డు సృష్టించనుంది. ఆస్తిపన్ను వసూలు కోసం గత 45 రోజులుగా రాజేంద్రనగర్ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. రోజూ సిబ్బందికి టార్గెట్‌లు విధిస్తూ ఆస్తిపన్ను వసూలు ప్రారంభించారు. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయడంతో పాటు ఆయా ఆస్తులను సీజ్ చేశారు. దీంతో మొండి బకాయిదారులు సైతం తమ ఆస్తిపన్నును చెల్లించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవికుమార్ శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ... ఆస్తిపన్ను చెల్లించేందుకు ఈ నెల 31వ తేదీ అవకాశం ఉందన్నారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా తమ ఆస్తిపన్నును ప్రజలు ఆన్‌లైన్ ద్వారా లేదా తమ సిబ్బందికి చెల్లించాలని సూచించారు. పండుగ రోజు సైతం తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు కానీ బిల్లు కలెక్టర్లకు కానీ ఆస్తిపన్నులు చెల్లించవచ్చన్నారు.


డీసీ రవికుమార్‌కు ఆస్తిపన్ను చెల్లిస్తున్న ప్రజలు

ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించాం...

ఆస్తిపన్ను పరిష్కార వేదికలలో వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించినట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ఆస్తిపన్ను పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మార్చిలో ప్రతి శనివారం ఆస్తిపన్ను పరిష్కార వేదికను నిర్వహించామన్నారు. పరిష్కార వేదికకు హాజరై ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించినట్లు వెల్లడించారు. సర్కిల్ కార్యాలయంలో మార్చి 31వ తేదీ వరకు పన్ను చెల్లించేందుకు ప్రత్యేకంగా బిల్లు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కౌంటర్ల ద్వారా తమ ఆస్తి పన్నులు చెల్లించాలన్నారు. మొండి బకాయిదారులకు ఇది మంచి అవకాశమని.. 90 శాతం ఆస్తి పన్నుపై విధించిన ట్యాక్స్‌ను ప్రభుత్వం రద్దు చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిశారు. కేకే–1 కాలనీలో చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్డు, పార్క్ మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తాగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బైరాగిగూడ, శ్రీనివాసనగర్, బీజేఎంసీలో ఉన్న కొత్త నీటి రిజర్వాయర్లు ప్రారంభించాలని కోరారు. వచ్చే వారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి దానిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శ్రీనివాసనగర్ కాలనీలో పైప్‌లైన్ వేయడం లేదని ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన జలమండలి మేనేజర్‌తో మాట్లాడి తనిఖీ చేసి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్, ఏసీఎఫ్ అధ్యక్షుడు వినయ్‌రెడ్డి, ప్రధాన సలహాదారు సుధాకర్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌బాబు, రాధాకృష్ణ, ఫ్రాన్సిస్, ప్రసాద్‌రెడ్డి, హేమశేఖర్, వినయ్‌పద్మనాభన్, మహేందర్‌రెడ్డి, శశిరెడ్డి, నర్సింహులు, రవిరాజా, రామన్న తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు సమస్యలు వివరిస్తున్న ఏసీఎఫ్ సభ్యులు

భాషా ప్రాముఖ్యతపై అవగాహన అవసరం

మైలార్‌దేవ్‌పల్లి: విశ్వావసు నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శ్రీరామ్‌నగర్ నేతాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ అధ్యక్షత వహించారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం పద్యాలు, ఎక్కాల పోటీలను నిర్వహించారు. పద్యాల పోటీల్లో విద్యార్థులు 20 పద్యాలు చెప్పి వాటి తాత్పర్యాన్ని వివరించారు. క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ... విద్యార్థులలో సృజనాత్మకతను, భాషా ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్, సాంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, మానవ సేవే మాధవ సేవా డైరెక్టర్ హేమలత, ఉపాధ్యాయులు మమత, మహేశ్వర్, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాటు కబ్జాకు యత్నించిన ముగ్గురిపై కేసు

శంషాబాద్: ప్లాటు కబ్జాకు యత్నించిన ముగ్గురిపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కరుణామయికాలనీలో సర్వేనంబర్ 745లో నగరంలోని బండ్లగూడ కేశవగిరి ప్రాంతానికి చెందిన మహ్మద్ మతీన్ ఉద్దీన్ సిద్ధిఖీకి చెందిన 192గజాల స్థలం ఉంది. ఈ స్థలంలో మహ్మద్ మహబూబ్‌ఖాన్, మహ్మద్ ముస్తఫాఖాన్‌లు ఓ కంటైనర్ డబ్బాను ఏర్పాటు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు మహ్మద్ మతీనుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్లాటు సమీపంలో ఉన్న ఇతరుల సరిహద్దులతో తన ఓ మహిళకు భూమిని విక్రయించినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు పరిశీలించిన పోలీసులు భూమిలో అక్రమంగా కంటైనర్ ఏర్పాటు చేయడంతో పాటు కబ్జాకు యత్నించిన మహబూబ్‌ఖాన్, ముస్తఫాఖాన్‌లతో పాటు మహిళపై కేసు నమోదు చేశారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులు, ఎస్‌టీఎఫ్ టీమ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు సంయుక్తంగా దాడులు నిర్వహించిన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ సమాచారం మేరకు... స్టేషన్ పరిధిలో మహ్మద్ చాంద్, మహ్మద్ రియాజ్, మహ్మద్ జావేద్, సాజిద్‌లు కలిసి గంజాయిని విక్రయిస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో మహ్మద్ చాంద్, రియాజ్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 2.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడి విషయాన్ని ముందే పసిగట్టిన సాజిద్, జావేద్‌లు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ వ్యాపారంలో నష్టాలు.. భర్త వేధింపులు...

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

అత్తాపూర్: ఆన్‌లైన్ వ్యాపారంలో నష్టం రావడంతో అదనంగా కట్నం కావాలని భర్త నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో భార్య కుటుంబ సభ్యులకు చెప్పలేక చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగన్న, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అమీష్ లోయ, పింకీ(30) ప్రేమించుకొని ఇరువురు కుటుంబాల ఆమోదంతో గత సంవత్సరం ఫిబ్రవరిలో వివాహం చేసుకున్నారు. అత్తాపూర్ పాండురంగానగర్ ప్రాంతంలో ఉంటున్నారు. పింకీ మెహిందీ డిజైనర్‌గా పండగలు, గృహాలలో జరిగే శుభకార్యాలలో పాల్గొంటారు. అమీష్ లోయ ఆన్‌లైన్ వ్యాపారాలతో పాటు ప్రైవేట్ బ్యాంకుల్లో లోన్లు ఇప్పిస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో నష్టపోయిన అమిష్ లోయ తరచు భార్యతో గొడవ పడుతూ పుట్టింటి నుంచి డబ్బులు తేవాలంటూ వేధించేవాడు. ప్రేమించి పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్న పింకీ సమాజంలో గౌరవంగా జీవించాల్సి ఉండగా అమీష్ లోయ జీవన విధానం సరిగా లేదంటూ తనకు తానుగా మానసికంగా కుంగిపోయింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అత్తాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ



రాజేంద్రనగర్: అనారోగ్యంతో ఇటీవల మరణించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు శివకుమార్ కుటుంబ సభ్యులను చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి శనివారం పరామర్శించారు. పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన శివకుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాబురావు, విజయ్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం

మణికొండ: ఆకలితో ఉన్న పేదలకు పట్టెడన్నం పెట్టడం తనకు ఎంతో ఆనందాన్నిస్తుందని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. శనివారం అమావాస్య సందర్భంగా అలకాపూర్ టౌన్‌షిప్‌లోని వారి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి నెల అమావాస్య రోజు క్రమం తప్పకుండా తమ అసోసియేషన్ తరపున అన్నదానం చేస్తున్నామన్నారు. అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాల నిర్వహణలో తమ సభ్యులు ముందుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లోను మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

చలివేంద్రాలతో దాహార్తికి చెక్

మణికొండ: వేసవిలో ప్రారంభంలోనే ఎండలు మండుతున్న నేపథ్యంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పైప్‌లైన్ రోడ్డులోని దీలిప్ సూపర్ మార్కెట్ వద్ద ఆర్యవైశ్య ఆఫీసర్స్, ప్రొఫెషనల్స్ (ఆవోపా) పుప్పాలగూడ అధ్యక్షుడు దారం వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు సమాజానికి తమ వంతు సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, జిల్లా అధ్యక్షుడు బి.శ్రీధర్, నేతలు దారం మల్లయ్య, సాయిరాం, కృష్ణ, రాములు, సాయిబాబు, మణికంఠ, విక్రమ్, బాలరాజు, భానుచందర్, యుగంధర్, స్రవంతి, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిగ్‌బాస్ ఫేం అవినాష్ హాజరయ్యారు. విద్యార్థులలో కలిసి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. విశ్వవిద్యాలయం అధికారులు వేణుగోపాల్ రెడ్డి, ఝాన్సీరాణి, ఈశ్వరి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

ప్రభాకర్‌రెడ్డి సేవలు అభినందనీయం

ప్రభుత్వ ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరికీ ఉద్యోగ విరమణ తప్పదని ఉద్యోగి నిజాయితీ నిబద్ధతలతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సి.హెచ్. విద్యాసాగర్ అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అధికారులు, తోటి ఉద్యోగులు ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ప్రభాకర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాదికి సర్వం సిద్ధం

- సర్వాంగ సుందరంగా దేవాలయాల ముస్తాబు
- పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు పూర్తి

రాజేంద్రనగర్: ఉగాది పర్వదినాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని బస్తీలు, దేవాలయాల్లో పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించడంతో పాటు సామూహికంగా ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

◆ రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, వెంకటేశ్వర స్వామి దేవాలయాలతో పాటు బుద్వేల్, బన్సీలాల్‌నగర్, గ్రీన్‌సిటీ, కృష్ణమ్మ గుట్ట, టీచర్స్ కాలనీ, శివరాంపల్లి, పీడీపీ చౌరస్తా, హైదర్‌గూడ, న్యూ వెంకటేశ్వర కాలనీ, నలందనగర్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాలతో పాటు బస్తీలు, అపార్ట్‌మెంట్లలో పంచాంగ శ్రవణ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో పంచాంగ ప్రకటన కార్యక్రమంతో పాటు పచ్చడి పంపిణీ కార్యక్రమానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.


దేవాలయాన్ని ముస్తాబు చేస్తున్న నిర్వాహకులు

◆ ఉగాది నేపథ్యంలో దేవాలయాన్ని చూడముచ్చటగా అలంకరిస్తున్నారు. శనివారం రాత్రి ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలను వివిధ రంగుల విద్యుత్ దీపాలతో పాటు పూలతో అందంగా అలంకరించారు.

జనపనార సంచులతో పర్యావరణ పరిరక్షణ


జ్యూట్ బ్యాగుల తయారీ బ్రోచర్‌ను అవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెను విఘాతం కల్గిస్తుందని తద్వారా మానవ మనుగడనే ప్రశ్నించేందిగా మారుతోందని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ కిషన్‌కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ జనపనార సంచులను వాడటం ద్వారా వాతావరణం కాపాడుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని నిర్వహించిన జనపనార సంచుల తయారీ శిక్షణ శనివారం ముగిసింది. శిక్షణలో పాల్గొన్న వారు తమంతట తాము ఒక యూనిట్‌ను ప్రారంభించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాని పూర్తిగా తగ్గించాలని తద్వారా వాతావరణంలో పాటు మనుషులు, పశువులు కూడి వీటిని తీని అనారోగ్యానికి గురవుతున్నాయని సూచించారు. కార్యక్రమంలో నార్స్ జాయింట్ డైరెక్టర్ రామసుబ్రమణియన్, అరుణజ్యోతి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

చిత్రపురి అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్

మణికొండ: చిత్ర పరిశ్రమ కార్మికుల కోసం నిర్మిస్తున్న గృహాల పనులను కొందరు కోర్టులలో కేసులు వేసి అడ్డుకుంటున్నారని, అందుకే పనులు అలస్యంగా జరుగుతున్నాయని చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఆయన అధ్యక్షతన చిత్రపురిలో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని రాజకీయాలు చిత్రపురిలో ఉండటంతోనే అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కుంటుపడిందన్నారు. వేలాది మంది సభ్యులు ఉన్న సొసైటీలో కొంత మంది తమ స్వలాబం, ఇగోతో కోర్టులలో ఇష్టానిరాజ్యంగా కేసులు వేశారన్నారు. అలాంటి వారి వలన మొత్తం సొసైటీకి చెడ్డ పేరు వస్తుందని, కేసులు వేసిన వారు ఇలాంటి సమావేశానికి వచ్చి తమ వద్ద ఉన్న సాక్ష్యాలను సభ్యుల ముందు ఉంచితే వారే నిజానిజాలు తెలుసుకుంటారన్నారు. ప్రభుత్వం అలాట్‌మెంట్ కమిటీలో సినిమా పరిశ్రమకు చెందిన సుద్దాల అశోక్, సృజనలను నియమించిందని, ఇక ముందు గృహ కేటాయింపులు, రిజిస్ట్రేషన్‌ల వ్యవహారాలు వారు చేసుకుంటారన్నారు. చిత్రపురి నూతనంగా నిర్మిస్తున్న ట్విన్ టవర్స్, ఇతర అభివృద్ధి వివరాలను వీడియో ద్వార సభ్యులకు చూయించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పీఎస్ఎన్ దొర, కోశాధికారి లలిత, సభ్యులు మహానందరెడ్డి, కాదంబరి కిరణ్, కె.రామకృష్ణప్రసాద్, వి.వి.ప్రసాద్, దీప్తి వాజ్‌పేయి పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశాన్ని జరగనివ్వమని, అవసరం లేదని కొందరు ప్రచారం చేయటంతో రాయదుర్గం పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

మద్యానికి డబ్బివ్వనందుకు వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మద్యం సేవించేందుకు డబ్బు ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... పట్టణంలోని సిద్దాంతికి చెందిన మహేష్(48) స్థానికంగా ఉన్న కూరగాయల మార్కెట్‌లో రిక్షా నడుపుతుంటాడు. మద్యానికి బానిసైన అతడు మద్యం కోసం శుక్రవారం రాత్రి ఇంట్లో డబ్బులు అడిగాడు. కుటుంబ సభ్యులు డబ్బిచ్చేందుకు నిరాకరించడంతో జీవితంపై విరక్తి చెంది మిషన్ కంపౌండ్ సమీపంలోని ఓ షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం విషయం తెలియడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నార్సింగిలోని ఆరోన్ ఆస్పత్రి సీజ్

మణికొండ: ఫోర్జరీ పత్రాలతో ఆస్పత్రి అనుమతిని రెన్యువల్ చేయించిన విషయాన్ని గుర్తించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో అధికారుల బృందం శనివారం నార్సింగిలోని ఆరోన్ ఆస్పత్రిని సీజ్ చేశారు. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల రెవెన్యూలో ఉన్న అరోన్ ఆస్పత్రి భవనం లీజు 2021లోనే ముగిసింది. ఆస్పత్రిని ఖాళీ చేయాలని భవన యజమానులు సూచించినా డైరెక్టర్ పట్టించుకోలేదు. దాంతో భవన యజమాని జిల్లా వైద్యాధికారులతో పాటు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అలియమ్మ సెబాస్టియన్‌పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. భవన యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో ఈ నెల 19వ తేదీన ఆస్పత్రి అనుమతులు రద్దు చేయటంతో పాటు వాటిని తిరిగి పొందే వరకు ఆస్పత్రిని మూసివేయాలని నోటీసులు జారీ చేశారు. అయినా పట్టించుకోకుండా ఆస్పత్రిని కొనసాగిస్తుండటంతో శనివారం దాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్పత్రులను కొనసాగించాలని, తప్పుడు పత్రాలతో అనుమతులు పొందటం నేరమన్నారు. ఇదే తరహాలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తనిఖీలలో జిల్లాలో ఐదుగురు నకిలీ ఆర్ఎంపీ డాక్టర్లను గుర్తించి పోలీసు కేసులు నమోదు చేశామన్నారు. అయినా క్లినిక్‌లను కొనసాగిస్తుండటంతో కొండాపూర్ మార్తాండ నగర్‌లోని కవిత ఫస్ట్ ఎయిడ్ సెంటర్, న్యూ హఫీజ్‌పేట్, గణేష్ మండపం సమీపంలోని రెహమానియా క్లినిక్, ఇదే కాలనీలోని వెంకటేశ్వర క్లినిక్, శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, మదీనాగూడ ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న కిరణ్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లను సీజ్ చేశామన్నారు. రాబోయే రోజుల్లో వీరు ఇతర ప్రాంతాలలో క్లినిక్‌లను నిర్వహించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా, మండల వైద్యాధికారులు పాల్గొన్నారు.

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముస్లింల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు బి.శ్రీరాములు, బాల్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, కుమార్, లక్ష్మీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తున్న డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు.. చిన్నగోల్కొండకు చెందిన లాలు గాని యాదయ్య(40) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం డ్యూటీకి వెళ్లేందుకు ఘాంసిమియా గూడ బయలుదేరాడు. ఔటర్ రింగు రోడ్డు ఎక్జిట్ 15 సర్వీసు రోడ్డు మార్గంలో ఇతని బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. తీవ్రగాయాలైన యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.